ఈవీఎం గోదాంను తనిఖీ చేసిన కలెక్టర్

ఈవీఎం గోదాంను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశీస్ సంగ్వాన్

కామారెడ్డి, అక్టోబర్ 4 : ఈవీఎం, వీవీ ప్యాట్ గోదామును కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ శుక్రవారం తనిఖీ చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈవీఎం, వీవీ ప్యాట్ నిల్వ చేసిన గోదామును తనిఖీ చేశారు. ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులు మదన్‌లాల్ జాదవ్, సంతోష్ రెడ్డి, కాసీమ్ అలీ, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు సరళా బాయి, డిప్యూటీ తహసీల్దార్లు అనిల్, ఇందిరా ప్రయదర్శిని పాల్గొన్నారు.

నేడు కామారెడ్డిలో రైతుల మహాసభ

మాట్లాడుతున్న భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు

కామారెడ్డి, అక్టోబర్ 4 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించే రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు తెలిపారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎలాంటి రాజకీయ సంబంధం లేకుండా ఈ మహాసభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతాంగాన్ని సంఘటితం చేయడం కోసం భారతీయ కిసాన్ సంఘ్ ఏర్పడిందని అన్నారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొమిరెడ్డి అంజన్న, జిల్లా అధ్యక్షుడు పైడి విఠల్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విజయ భాస్కర్, జాతీయ కార్యవర్గ సభ్యుడు శంకర్ రావు, జిల్లా కార్యదర్శి రాజేశం, ఉపాధ్యక్షుడు నగేశ్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

కామారెడ్డి జిల్లా రైస్ మిల్ సంఘం నూతన అధ్యక్షుడు పప్పుల రాజేంద్రప్రసాద్, సభ్యులు శుక్రవారం ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీని మర్యాదపూర్వకంగా కలిశారు. – కామారెడ్డి, అక్టోబర్ 4

మాట తప్పడం.. ఎదురు తిరగడం..

- కాంగ్రెస్ నాయకుల విష సంస్కృతి
- గాంధారి ఏఎంసీ మాజీ చైర్మన్ ఇంటి ముట్టడికి యత్నం
- అడ్డుకున్న గ్రామస్తులు, పోలీసులు

సర్వాపూర్‌లో మాజీ ఏఎంసీ చైర్మన్ సత్యంరావు ఇంటి వద్ద పోలీసులు

కాంగ్రెస్ నాయకులను అడ్డుకుంటున్న గ్రామస్తులు, పోలీసులు

గాంధారి, అక్టోబర్ 4: మాట తప్పడం, అడిగితే ఎదురు తిరగడం కాంగ్రెస్ నాయకుల నైజంగా మారింది. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం పథకాలను అమలు చేయాలని, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే తీరు బాగా లేదని ప్రతిపక్ష నాయకులు ప్రశ్నించారు. దీంతో వారి ఇండ్లను ముట్టడించడానికి యత్నించి, కాంగ్రెస్ నాయకులు విష సంస్కృతికి తెరలేపుతున్నారు. వివరాల్లోకి వెళితే.. సెప్టెంబర్ 30వ తేదీన గాంధారిలో అఖిల పక్షం ఆధ్వర్యంలో రైతు మహాధర్నాను నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న గాంధారి ఏఎంసీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు సత్యంరావు కాంగ్రెస్ తీరును ఎండగట్టారు. రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రస్తుత ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు స్థానికంగా ఉండడం లేదని, నియోజకవర్గంలో పీఏల పెత్తనం నడుస్తున్నదని ఆరోపించారు. ఈ విషయమై మండలంలోని ముదెల్లి, గండివేట్ గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు శుక్రవారం సర్వాపూర్‌లో ఏఎంసీ మాజీ చైర్మన్ ఇంటిని ముట్టడించేందుకు యత్నించారు. దీంతో సర్వాపూర్ గ్రామస్తులు వారిని అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న ఎస్సై ఆంజనేయులు తమ సిబ్బందితో గ్రామానికి వెళ్లి కాంగ్రెస్ నాయకులను అడ్డుకొని, అక్కడి నుంచి పంపించివేశారు. ఈ విషయమై సత్యంరావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకులు నియోజకవర్గంలో కొత్త సంస్కృతికి తెర లేపుతున్నారని, ప్రశ్నించిన ప్రతిపక్ష నాయకులపై దాడి చేయడం, ఇండ్లు ముట్టడించడం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, అధికారాన్ని అడ్డం పెట్టుకొని ప్రతిపక్షాల గొంతునొక్కడానికి ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

మాచారెడ్డి, అక్టోబర్ 4 : మండలంలోని కాకులగుట్ట తండాకు చెందిన వ్యక్తి గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై అనిల్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. కాకులగుట్టతండా గ్రామానికి చెందిన బానావత్ హనుమ(58) పని నిమిత్తం బైక్ పై మాచారెడ్డి వచ్చాడు. కాకులగుట్టతండాకు వెళ్లే రోడ్డు దగ్గర యూటర్న్ తీసుకుంటుండగా మాచారెడ్డి వైపు వెళ్తున్న మరో బైక్ ఢీకొట్టింది. దీంతో హనుమకు తీవ్రగాయాలు కాగా వెంటనే అంబులెన్స్‌లో కామారెడ్డికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై వివరించారు. మృతుడి భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఒకరి అదృశ్యం

కామారెడ్డి, అక్టోబర్ 4 : పట్టణంలోని రాజీవ్ నగర్ కాలనీకి చెందిన ఏలేటి అచ్యుత్ కుమార్ అదృశ్యమైనట్లు పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 3వ తేదీ గురువారం ఉదయం 11.30 గంటలకు అచ్యుత్ బయటికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని తెలిపారు. ఫోన్ స్విచ్‌ఆఫ్ రావడంతో అతని భార్య ఏలేటి లలిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఇతని ఆచూకీ తెలిసిన వారు కామారెడ్డి పట్టణ పోలీసు స్టేషన్‌లోగాని, 8712686145, 8712666242 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

పంచాయతీ కార్యదర్శి నుంచి టీచర్‌గా

బీబీపేట్, అక్టోబర్ 4 : మండలంలో తుజాల్‌పూర్ గ్రామానికి చెందిన నవీన్ మాందాపూర్ గ్రామంలో పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తూనే టీచర్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ.. సంకల్పించి కష్టపడి చదివితే సాధించలేనిది ఏది లేదన్నారు.

వరకట్నం వేధింపుల కేసులో ఇద్దరికి ఏడేండ్ల జైలు

కామారెడ్డి, అక్టోబర్ 4 : వరకట్నం వేధింపులు, మరణం కేసులో నేరస్తులైన భర్త మల్లాని గణేశ్, అత్త మల్లాని ఎల్లవ్వకు ఏడేండ్ల జైలు శిక్ష, ఒక్కొక్కరికీ రూ.పది వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు ఇచ్చినట్లు ఎస్పీ సింధూశర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. భిక్కనూర్ మండలం సంగమేశ్వర్ గ్రామానికి చెందిన లావణ్య, భిక్కనూర్ మండలం రామేశ్వరపల్లి గ్రామానికి చెందిన మల్లాని గణేశ్‌ను ప్రేమించగా పెద్దల సమక్షంలో వివాహం చేశారు. కానీ.. గణేశ్ తల్లిదండ్రులకు ఈ పెండ్లి ఇష్టం లేదు. కొన్ని నెలల క్రితం గణేశ్ చెల్లెలికి పాపపుట్టి ఆరోగ్యం బాగా లేక చనిపోయింది. అప్పటి నుంచి గణేశ్, తల్లి ఎల్లవ్వ లావణ్యను వరకట్నం తేవాలని శారీరకంగా, మానసింగా బాధ పెడుతూ చిత్రహింసలకు గురిచేశారు. ఈ బాధలు భరించలేక లావణ్య ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. లావణ్య సోదరుడు బట్టు రామస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. అప్పటి ఎస్సై రాజు, అప్పటి డీఎస్పీ ప్రసన్నరాణి దర్యాప్తును ప్రారంభించారు. గ్రామస్తులు, కులస్తులు, ఇతరులను విచారించారు. కేసులో సాక్షాధారాలను పరిశీలించి కేసు రుజువు కావడంతో జిల్లా జడ్జి సీహెచ్.వీఆర్ఆర్ వరప్రసాద్ నిందితులకు ఏడేండ్ల కఠిన కారాగార శిక్షతోపాటు ఒక్కొక్కరికి రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు తెలిపారు. పోలీసుల తరపున వాదనలు వినిపించిన పీపీ రాజగోపాల్ గౌడ్, ఈ కేసును సరైన పద్ధతిలో విచారణ చేసిన అప్పటి డీఎస్పీ ప్రసన్న రాణి, భిక్కనూర్ సీఐ కోటేశ్వర్‌రావు, సంపత్‌కుమార్, ఎస్సై సాయికుమార్, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ మురళి, సీడీవో మురళీకృష్ణ, ప్రమోద్‌కుమార్‌రెడ్డిని ఎస్పీ అభినందించారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

ఉప్పర్‌పల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి సతీశ్‌యాదవ్

బీబీపేట్, అక్టోబర్ 4 : పరిసరాలను శుభ్రంగా ఉంచాలని మండల ప్రత్యేకాధికారి సతీశ్‌యాదవ్ అన్నారు. మండలంలోని ఉప్పర్‌పల్లి గ్రామాని శుక్రవారం ఆయన సందర్శించారు. గ్రామంలో చేపట్టిన పల్లె ప్రగతి పనులను పరిశీలించారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులు సరిగ్గా లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. పారిశుద్ధ్య పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఫౌష్టికాహారాన్ని పిల్లలకు అందించాలన్నారు. గ్రామాభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పూర్ణ చంద్రోదయకుమార్, పంచాయతీ కార్యదర్శి వెన్నెల, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పిచ్చిమొక్కలను తొలగించండి



స్తంభానికి అల్లుకున్న పిచ్చి మొక్కలు

బీబీపేట్, అక్టోబర్ 4 : విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో విద్యుత్ వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లకు పిచ్చి మొక్కల తీగలు ఏపుగా పెరిగి అల్లుకున్నా విద్యుత్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. బీబీపేట నుంచి తుజాల్‌పూర్‌కు వెళ్లేదారిలో విద్యుత్ స్తంభానికి పిచ్చి మొక్కల తీగలు ఏపుగాపెరిగి వైర్లను పూర్తిగాకప్పేశాయి. దానిపక్కనే ఉన్న మరో స్తంభానికి కూడా పిచ్చి మొక్కల తీగలు అల్లుకున్నాయి. దీంతో పలుమార్లు విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతున్నదని రైతులు, గ్రామస్తులు తెలిపారు. విద్యుత్ అధికారులు సమస్యలను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

మొరం తీసిన గుంతలో పడి యువకుడి దుర్మరణం

ఎల్లారెడ్డి, అక్టోబర్ 4: మొరం తీసిన గుంతలో పడి యువకుడు మృతిచెందిన ఘటన మండలంలోని కొక్కొండ గ్రామ శివారులో గురువారం చోటుచేసుకున్నది. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్సై మహేశ్ శుక్రవారం వెల్లడించారు. కొక్కొండ గ్రామానికి చెందిన కమ్మరి బ్రహ్మం(19) మద్యానికి బానిసగా మారాడు. గురువారం మధ్యాహ్నం బహిర్భూమికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. గ్రామ శివారులో మొరం తీసిన కుంటలో అతడి మృతదేహం తేలింది. దీంతో గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

తాగుడుకు బానిసై వ్యక్తి ఆత్మహత్య

పెద్దకొడప్‌గల్, అక్టోబర్ 4: తాగుడుకు బానిసైన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన పిట్లం మండలంలో చోటుచేసుకున్నది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. పిట్లం గ్రామానికి చెందిన జంగం విఠల్ (37) తాగుడుకు బానిసయ్యాడు. ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో పిట్లం శివారులోని మారేడు చెరువులో శుక్రవారం దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, కొడుకు, కూతు రు ఉన్నారని ఎస్సై తెలిపారు. మృతుడి భార్య గంగామణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్
WANTED
★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-331783-All
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సదాశివనగర్ ఏఎంసీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం

ప్రమాణస్వీకారం చేస్తున్న ఏఎంసీ చైర్మన్ సంగ్యానాయక్

రామారెడ్డి. అక్టోబర్ 4: సదాశివనగర్ మార్కెట్ కమిటీ నూతన పాలక వర్గ ప్రమాణ స్వీకారాన్ని మర్కల్‌లోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించారు. చైర్మన్ సంగ్యానాయక్, ఉపాధ్యక్షుడు జక్కుల రాజిరెడ్డి తోపాటు డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు, ఎంపీ సురేశ్ షెట్కార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సదాశివనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని చెప్పారు. నిస్వార్థ సేవలను అందించి రైతుల్లో గుర్తింపు పొందాలని నూతన పాలక వర్గానికి సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ పరిధిలోని ఆయా మండలాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక పరిశీలన

శ్మశానవాటిక వద్ద పనులను పరిశీలిస్తున్న అధికారులు

నాగిరెడ్డిపేట, అక్టోబర్ 4: మండల కేంద్రంలోని గోపాల్‌పేట శ్మశాన వాటిక, డంపింగ్ యార్డును మండల ప్రత్యేక అధికారి లక్ష్మీప్రసన్న శుక్రవారం పరిశీలించారు. వాటిలో పేరుకుపోయిన చెత్తను తొలగించి శుభ్రం చేయిస్తుండడంపై సంతృప్తిని వ్యక్తంచేశారు. మండలంలో గ్రామ పంచాయతీల వారీగా చేపడుతున్న పనులను ఎంపీడీవో ప్రభాకర్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కిష్టయ్య తదితరులు ఉన్నారు.

బైపాస్ మీదుగా హైదరాబాద్‌కు బస్సులు

కండక్టర్‌తో వాగ్వాదానికి దిగిన ప్రయాణికులు

బస్సును పెద్దకొడప్‌గల్ బస్టాండ్‌లోకి తీసుకొచ్చిన డ్రైవర్

- పెద్దకొడప్‌గల్ బస్టాండ్‌లోకి రాక ప్రయాణికులకు ఇబ్బందులు
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు

పెద్దకొడప్‌గల్, అక్టోబర్ 4: జుక్కల్ నియోజకవర్గంలో ఆర్టీసీ బస్సు డిపోలు లేవు. సమీపంలో బాన్సువాడ డిపో ఉన్నా.. బస్సులు సరిగా రావడం లేదని పెద్దకొడప్‌గల్ మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. బిచ్కుంద, పెద్దకొడప్‌గల్ మీదుగా హైదరాబాద్ వెళ్లాలంటే.. గజ్వేల్ ప్రజ్ఞాపూర్, హైదరాబాద్ డిపో బస్సులే ఉన్నా యి. కానీ పెద్దకొడప్‌గల్ మీదుగా హైవే నంబర్ 161ఉన్నది. దీంతో హైదరాబాద్ వెళ్లే బస్సులు పెద్దకొడప్‌గల్ ఆర్టీసీ బస్టాండ్‌కు రాకుండా బైపాస్ మీదుగా వెళ్తున్నా యి. దీంతో బస్సుల కోసం బస్టాండ్ వద్ద వేచి చూస్తున్న ప్రయాణికులు బస్సులు రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

బస్సుల కోసం పెద్దకొడప్‌గల్ బస్టాండ్‌లో శుక్రవారం పలువురు ప్రయాణికులు వేచి చూస్తున్నారు. ఈ క్రమంలో గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బస్టాండ్‌లోకి రాకుండా బైపాస్ మీదుగా వెళ్లడం ప్రయాణికులు గమనించారు. పలువురు బైక్‌పై వెళ్లి బస్సును అడ్డుకున్నారు. బస్టాండ్‌లోకి రాకుండా ఎందుకు బైపాస్ మీదుగా ఎందుకు వెళ్తున్నారని కండక్టర్‌తో వాగ్వాదానికి దిగారు. బస్సును బస్టాండ్‌కు వచ్చేలా చేశారు. ఈ సందర్భంగా పలువురు ప్రయాణికులు మాట్లాడుతూ.. హైదరాబాద్ వెళ్లాలంటే బస్సులు బస్టాండ్‌లోకి రావడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ విషయమై ఆర్టీసీ అధికారులకు గతంలో ఫిర్యాదు చేశామని, అయినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా స్పందించి బస్టాండ్‌లోకి బస్సులు వచ్చే విధంగా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

తప్పుడు ధ్రువపత్రాలతో పాస్‌పోర్టు

ఢిల్లీ పోలీసుల అదుపులో రెడ్డిపేటవాసి

రామారెడ్డి, అక్టోబర్ 4: తప్పుడు ధ్రువపత్రాలతో పాస్‌పోర్టు పొందిన రామారెడ్డి మండలం రెడ్డిపేట గ్రామానికి చెందిన వ్యక్తిని ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకొని పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రెడ్డిపేటకు చెందిన వాహబ్ మహమ్మద్ తప్పుడు ధ్రువపత్రాలతో హసేన్ మహమ్మద్‌గా పేరు మార్చుకొని పాస్‌పోర్టు పొందాడు. వాహబ్ మహమ్మద్ పేరుతో గతంలో సౌదీకి వెళ్లగా కేసు నమోదు కావడంతో ఇండియాకు పంపించారు. తిరిగి ఇప్పుడు హసేన్ మహమ్మద్‌గా సౌదీ వెళ్లగా అక్కడి ఇమిగ్రేషన్ అధికారులు పట్టుకొని తిరిగి ఇండియాకు పంపినట్లు తెలిసింది. ఇండియా ఇమిగ్రేషన్ అధికారులకు సౌదీ ఇమిగ్రేషన్ అధికారులు సమాచారం ఇవ్వడంతో.. ఢిల్లీ విమానాశ్రయంలో దిగిన వాహబ్ మహమ్మద్‌ను పోలీసులు కస్టడీలోకి తీసుకొని కేసు నమోదు చేశారు. రెడ్డిపేట పరిధిలోని జగదాంబ తండా మాజీ ఉపసర్పంచ్ శంకర్‌నాయక్ సహకారంతో.. కామారెడ్డిలోని ఒక జిరాక్స్ సెంటర్‌లో రెండో పాస్‌పోర్టు పొందినట్లు తెలిపారు. ఢిల్లీ పోలీసులు శంకర్‌నాయక్‌ను అరెస్ట్ చేయగా.. జిరాక్స్ సెంటర్ యజమాని పరారీలో ఉన్నట్లు తెలిసింది.

గ్రామాల్లో క్లోరినేషన్ చేసిన నీటిని సరఫరా చేయాలి

వాటర్‌మన్ సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్పీవో సురేందర్

నిజాంసాగర్‌లో అవగాహన కల్పిస్తున్న అధికారి

లింగంపేట/ నిజాంసాగర్, అక్టోబర్ 4: గ్రామాల్లో క్లోరినేషన్ చేసిన తాగునీటిని సరఫరా చేయాలని ఎల్లారెడ్డి డీఎల్పీవో సురేందర్ సూచించారు. లింగంపేటలోని రైతు వేదికలో వాటర్‌మెన్‌లకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో తాగునీటిని సరఫరా చేయడంలో వాటర్‌మెన్లు కీలకం అన్నారు. పైప్‌లైన్ లీకేజీలను ఎప్పటికప్పుడు గుర్తించి మరమ్మతులు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరేశ్, ఎంపీవో మల్లారితో పాటు మిషన్ భగీరథ అధికారులు పాల్గొన్నారు.

నిజాంసాగర్ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పనిచేసే తాగునీటి సహాయకులకు శుక్రవారం శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. నిజాంసాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 8వ తేదీ వరకు ఈ శిక్షణ తరగతులు కొనసాగుతాయి. బోరుబావుల రిపేరు, లీకేజీలను అరికట్టడం తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీవో గంగాధర్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ వెంకటేశ్వర్‌గౌడ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుమలత తదితరులు పాల్గొన్నారు.

మూసీ ప్రక్షాళన కాళేశ్వరం కన్నా గొప్పపథకం కాదు

ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డితో కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్న నాగిరెడ్డిపేట మాజీ జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి

నాగిరెడ్డిపేట, అక్టోబర్ 4: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న మూసీ నది ప్రక్షాళన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు కన్నా గొప్ప పథకం కాదని జడ్పీటీసీల ఫోరం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి మనోహర్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యే పాడి కౌషిక్‌రెడ్డితో కలిసి శుక్రవారం మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన నమస్తే తెలంగాణతో మాట్లాడారు. హైడ్రాతో నిరుపేదలకు నష్టం జరుగుతోందన్నారు. వారి తరపున బీఆర్ఎస్ పోరాటం చేస్తున్నదన్నారు.

వన్యప్రాణుల రక్షణపై విద్యార్థులకు అవగాహన

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారి వాసుదేవ్

నాగిరెడ్డిపేట, అక్టోబర్4: అటవీ సంరక్షణ, వన్యప్రాణి రక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని నాగిరెడ్డిపేట అటవీశాఖ ఎఫ్ఆర్‌వో వాసుదేవ్ అన్నారు. మండల కేంద్రంలోని సిద్ధార్థ కళాశాల విద్యార్థులకు 70వ వన్యప్రాణి సప్త కార్యక్రమంలో భాగంగా ఫారెస్టును సందర్శించారు. విద్యార్థులతో కలిసి ధర్మారెడ్డి అటవీ ప్రాంతంలో తిరుగుతూ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఫారెస్ట్‌లో కందకాలు, కుంటలను చూపించి వాటితో కలిగే ప్రయోజనాలను వివరించారు. తాండూర్ శివారులో ఎస్ఎమ్ఎమ్ (మెకానికల్ మెథడ్ విధానం)లో నాటి సంరక్షిస్తున్న మొక్కలను విద్యార్థులకు చూపించారు. కార్యక్రమంలో బీట్ అధికారులు నవీన్‌కుమార్, లవన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మద్నూర్‌లో

సోయా కొనుగోలు కేంద్రం ప్రారంభం

మద్నూర్, అక్టోబర్ 4: మండలకేంద్రంలోని మార్కెట్ యార్డులో నేడు (శనివారం) సోయా కొనుగోలు కేంద్రం ప్రారంభించనున్నట్లు సొసైటీ కార్యదర్శి బాబూరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్క్‌ఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోళ్లు చేపడుతారని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తారని తెలిపారు.